కీసరగుట్ట దేవస్థానంలో హరికథ



హరికథ చెబుతున్న లక్ష్మీ నారాయణ భాగవతార్

కీసర: కీసరగుట్ట శ్రీరామలింగేశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం హరికథ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర హరికథ కళాకారులు లక్ష్మీ నారాయణ భాగవతార్ హరికథను వినిపించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సుధాకర్‌రెడ్డి, చైర్మన్ నారాయణశర్మ, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బోనాల జాతర



కొర్రెములలోని పోచమ్మ ఆలయంలో పూజల్లో పాల్గొన్న భద్రారెడ్డి

పోచారం: పోచారం మున్సిపాలిటీ పరిధిలోని కొర్రెముల్, ముత్వెల్లిగూడ, కాచవానిసింగారం ప్రాంతాల్లో ఆదివారం బోనాల జాతర ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొర్రెములలోని పోచమ్మ, మహంకాళి ఆలయాల్లో అమ్మవార్లను సీఎంఆర్ హెల్త్ సిటీ చైర్మన్ చామకూర భద్రారెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

మేడ్చల్‌రూరల్: సీపీఐ రాష్ట్ర 4వ మహాసభల వాల్‌పోస్టర్‌ను ఆదివారం మేడ్చల్‌లో పార్టీ నాయకులు ఆవిష్కరించారు. మేడ్చల్ పట్టణంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహాసభల గౌరవ అధ్యక్షుడు సాయిలుగౌడ్, ఏఐటీయూసీ నాయకులు రవిచంద్రన్, మండల సీపీఐ కార్యదర్శి నారెడ్డి శశిధర్‌రెడ్డి, బాబు, నరేంద్రప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.

సత్యనారాయణ కాలనీలో రక్షాబంధన్ వేడుక



కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని సత్యనారాయణ కాలనీ కమ్యూనిటీహాల్‌లో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో ఆదివారం రక్షా బంధన్ ఉత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సూర్య నారాయణమూర్తి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ చంద్రారెడ్డి, కిషోర్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, రాజశేఖర్, సురేందర్ రెడ్డి, కృష్ణచారి, బీజేపీ నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

పీఎన్ఆర్ కాలనీ నూతన కార్యవర్గం ఎన్నిక

బోడుప్పల్: పీఎన్ఆర్ కాలనీ సర్వసభ్య సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో పలు సమస్యలపై చర్చించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. వ్యవస్థాపక చైర్మన్‌గా పి. దిలీప్‌రెడ్డి, అధ్యక్షుడిగా కె. శ్రీనివాస్‌రావు, ఉపాధ్యక్షుడిగా వెంకటేశం, ప్రధాన కార్యదర్శులుగా శ్రీకాంత్, సందీప్, కోశాధికారిగా శంకర్‌గౌడ్, సంయుక్త కార్యదర్శిగా ప్రకాశ్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా రాజేష్, రమేష్, మధు కుమార్, శేఖర్, మహిళ ప్రతినిధులుగా సరిత, మాధవి ఎన్నికయ్యారు. ఈ సందన్భంగాగా అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ కాలనీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

'హలో మాల చలో ఢిల్లీ' కరపత్రం ఆవిష్కరణ

గౌతంనగర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాలలకు తీవ్ర అన్యాయం చేస్తున్నాయని మాల మహానాడు ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షులు డాక్టర్ పసూల రాంమూర్తి అన్నారు. ఈ నెల 19, 20, 21 తేదీల్లో ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద నిర్వహించనున్న 'హలో మాల చలో ఢిల్లీ' నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ ఆదివారం గౌతంనగర్ డివిజన్ జ్యోతినగర్‌లో సమావేశం నిర్వహించి కరపత్రాన్ని అవిష్కరించారు. కార్యక్రమంలో సాధు, పరమేశ్వర్, రామ్మోహన్, శ్రీనివాస్, సాయికుమార్, గౌతమ్, దాసు, చిన్నా, నర్సింహ, ప్రభాస్ తదితరులు పాల్గొన్నారు.

వెనుకబడిన ప్రాంతాల్లో అంగన్‌వాడీలు

నూతనంగా 60 అంగన్‌వాడీ కేంద్రాలు

- 30 క్రష్ సెంటర్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు
- ప్రభుత్వానికి జిల్లా సంక్షేమ శాఖ ప్రతిపాదనలు
- ఆమోదం లభించగానే ప్రారంభించేందుకు చర్యలు
- బేబీ కేర్ సెంటర్లను తలపించేలా క్రష్ కేంద్రాలు
- జిల్లాలో ప్రస్తుతం 793 అంగన్‌వాడీ కేంద్రాలు, 1.07లక్షల లబ్ధిదారులు



సాక్షి,మేడ్చల్ జిల్లా: నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో వెనుకబడిన ప్రాంతాలు ,దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న ప్రజలు నివసించే బస్తీలు, పురపాలక సంఘాల్లోని కాలనీల్లో నూతన అంగన్‌వాడీ కేంద్రాలతో సహా క్రస్ (బేబీ కేర్) సెంటర్లను ఏర్పాటు చేసేందుకు జిల్లా సంక్షేమ శాఖ చర్యలు తీసుకుంటోంది. జిల్లాలో ఇప్పటికే గుర్తించిన వెనుకబడిన ప్రాంతాలు , బస్తీలు, కాలనీల్లో నూతనంగా 60 అంగన్వాడీ కేంద్రాలతో పాటు 30 క్రష్(బేబీ కేర్) సెంటర్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసిన జిల్లా సంక్షేమ శాఖ సంబంధిత రాష్ట్ర ఉన్నతాధికారులకు నివేదించింది. ఈ ప్రతిపాదలనకు ఆమోదం లభించగానే, ప్రారంభించేందుకు జిల్లా సంక్షేమ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. నూతన అంగన్‌వాడీ కేంద్రాలు ,క్రష్ సెంటర్ల ఏర్పాటుపై జిల్లాలో అంగన్‌వాడీ ప్రాజెక్టుల వారీగా కొత్త అంగన్‌వాడీ సర్వే కార్యక్రమాన్ని పూర్తి చేయడంతో పాటు ప్రాంతాలను గుర్తించారు. నూతనంగా నిర్వహించ తలపెట్టిన అంగన్‌వాడీ కేంద్రాలు , క్రష్ సెంటర్లలో లబ్ధిదారులైన గర్భిణులు, బాలింతలతో సహా 7 నెలల నుంచి 3 సంవత్సరాల చిన్నారులు, మూడేళ్ల నుంచి 6 సంవత్సరాల పిల్లలను గుర్తించిన సంక్షేమ శాఖ అధికారులు వారి వివరాలతో కూడిన సమాచారాన్ని రూపొందించారు. వీటి ఏర్పాటుపై ప్రభుత్వం నుంచి అనుమతి లభించిన వెంటనే రంగంలోకి దిగేందుకు జిల్లా సంక్షేమ శాఖ అధికారవర్గాలు సన్నద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

అనువైన కేంద్రాల్లోనే క్రష్ సెంటర్లు

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో నూతనంగా ఏర్పాటు చేయనున్న క్రష్(బేబీ కేర్) సెంటర్లను అనువైన అంగన్‌వాడీ కేంద్రాల్లో నెలకొల్పేందుకు జిల్లా సంక్షేమ శాఖ చర్యలు తీసుకుంటోంది. సొంతభవనం కలిగి ఉండి.. విశాలమైన గదులున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో క్రష్ సెంటర్లను ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. తద్వారా చిన్న పిల్లల సంరక్షణ(కేర్) బాగుంటుందని జిల్లా సంక్షేమ శాఖ అధికారులు భావిస్తున్నారు. నిరుపేద, మధ్యతరగతి కుటుంబాల్లో చిన్న పిల్లలను కలిగి ఉన్న భార్యభర్తలు కార్మికులుగా లేదా పరిశ్రమలతోపాటు ఇతరతర ఉద్యోగాలు చేసినప్పుడు వారి సంరక్షణ కోసం క్రష్ సెంటర్లు ఎంతగానో ఉపయోగపడగలవని సంక్షేమ శాఖ అధికార వర్గాలు తెలిపాయి. ఆయా క్రష్ సెంటర్లలో పిల్లల సంరక్షణ ఏలాంటి ఫీజులు లేకుండా ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు.

గర్భిణులు, పసికందులకు ప్రాధాన్యం..

చిన్న పిల్లలతోసహా గర్భిణులు, బాలింతల ఎదుగుదలకు అంగన్‌వాడీ కేంద్రాలు ఎంతగానో దోహదపడనున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్య. ఆరోగ్య రక్షణ చర్యలతో పాటు గర్భిణులు, బాలింతల సంపూర్ణ ఆరోగ్యానికి ఆరోగ్యలక్ష్మి పథకాన్ని అమలు చేయాల్సి ఉంటుంది. ఇందులో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల పాత్ర కీలకం కానుంది. ఒకటి నుంచి ఆరు సంవత్సరాల్లోపు పిల్లలు అంగన్వాడీ సెంటర్లకు వస్తారు. పిల్లల పరిశుభ్రత, ఉడికించిన కోడిగుడ్లు ఇవ్వటం, పౌష్టికాహారం ఇవ్వడం వంటి విధులను వారు నిర్వహిస్తారు. పసి పిల్లల వ్యక్తిగత శుభ్రత విషయంలో హెల్పర్లు జాగ్రత్తలు తీసుకుంటారు.

జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల వివరాలు ఇలా..

ప్రాజెక్టు	అంగన్‌వాడీ కేంద్రాలు	లబ్ధిదారుల సంఖ్య
మేడ్చల్	211	39,463
అల్వాల్	269	20,993
కుత్బుల్లాపూర్	313	47,028
మొత్తం	793	1,07,484

బీఆర్‌ఎస్‌లోనే ఉంటా..

మాజీ మంత్రి ఎమ్మెల్యే మల్లారెడ్డి



మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి

జవహర్‌నగర్: రాజకీయాల్లో రిటైర్మెంట్ ఉండదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. ఆదివారం జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్ ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ.. తాను రిటైర్మెంట్ తీసుకుంటానని అనలేదని, బీజేపీ, తెలుగుదేశం పార్టీల్లో చేరతానని చెప్పలేదని, బీఆర్‌ఎస్‌లోనే కొనసాగుతానన్నారు. దేశమంతా విద్యాసంస్థలను నెలకొల్పి యువతకు నాణ్యమైన విద్యనందిస్తానన్నారు. జవహర్‌నగర్ ప్రధాన రహదారి అబిడ్స్ మోడల్‌ను తలపిస్తుందని, జవహర్‌నగర్‌లోని ప్రతి ఇంటికి తాగునీరు అందించేందుకు మిషన్ భగీరథతో నల్లా కనెక్షన్లు ఇచ్చిన ఘనత కేసీఆర్, కేటీఆర్‌లకే దక్కుతుందన్నారు. జవహర్‌నగర్ అభివృద్ధికి అండగా ఉంటానని, ప్రజలకు సేవ చేయడంతో ఎంతో సంతృప్తి ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ మేయర్ కావ్య, బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు కొండల్ ముదిరాజ్, ఉద్యమకారుల ఫోరం జవహర్‌నగర్ అధ్యక్షులు సుధాకర్‌చారి, నాయకులు రాజశేఖర్, మహేష్, ఎల్లస్వామి, సాధిక్, మతిన్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి



మాట్లాడుతున్న రవి, అరుణ్‌కుమార్

ఘట్‌కేసర్: అంబేడ్కర్ ఆలోచన విధానాలను నేటి యువత అనుసరించాలని స్థానిక అంబేడ్కర యువజన సంఘం సభ్యుడు రవి అన్నారు. పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ప్రబుద్ధ భారత్ బాధ్యుడు అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల సమర్పణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో అంటరానితనం, కుల, మత, లింగ. దురహంకార దాడుల సంస్కృతిలో ప్రజాస్వామిక, మానవీయ విలువలు పాటిస్తున్న వారికి అంబేడ్కర్ ఎల్లప్పుడు తోడు ఉంటారన్నారు. అంబేడ్కర్ ఆశయాలు పాటిస్తూ ప్రజలను చైతన్యం చేయాలన్నారు. కార్యక్రమంలో నర్సింగ్‌రావు, రాందాసు, నారాయణ, జగదీశ్, అంజయ్య, శ్రీకాంత్, మహేశ్వరీ, సిద్దయ్య, కష్ణంరాజు, ఉపేందర్, విష్ణు, వివేక్, లలిత్ పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లపై పార్లమెంట్‌లో చట్టం చేయాలి



ఈసీఐఎల్ చౌరస్తాలో ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

కుషాయిగూడ: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ పార్లమెంట్‌లో చట్టం చేయాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎస్. వీరయ్య డిమాండ్ చేశారు. బీసీల రిజర్వేషన్ల అమలుపై సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో భాగంగా ఆదివారం పార్టీ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈసీఐఎల్ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్లపై తెలంగాణ అసెంబ్లీలో చేసిన తీర్మాణాన్ని బీజేపీ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టకపోవడం బీసీలకు మోసం చేయడమేనన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఆర్డినెన్స్‌ను గవర్నర్ ఆమోదించకుండా కేంద్రానికి పంపడం సరికాదన్నారు. బీజేపీకి చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు కేంద్రంపై ఒత్తిడి ఎందుకు తేవడం లేదన్నారు. వెనుకబడిన వర్గాలు అన్ని కులాలలో ఉంటారన్న వాస్తవాన్ని గ్రహించకుండా బీసీ బిల్లును వ్యతిరేకిస్తూ బీసీల పట్ల బీజేపీ వ్యతిరేకతను వ్యక్తం చేస్తుందన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాలైన గుజరాత్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌లో అమలవుతున్న చట్టాలు తెలంగాణ అమలు చేయడానికి అభ్యంతరమేమిటో అర్థం కావడం లేదన్నారు. బీసీ రిజర్వేషన్ల బిల్లు సాధనకు అన్ని పార్టీలు రాజకీయాలకు అతీతంగా పోరాడాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పాలడుగు భాస్కర్, జిల్లా కార్యదర్శి కోమటి రవి, చంద్రశేఖర్, అశోక్, జి. శ్రీనివాసులు, రాజశేఖర్, శ్రీనివాస్, లక్ష్మణ్, శంకర్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

మేదరులు రాజకీయంగా బలోపేతం కావాలి

మల్లాపూర్: మేదర కులస్తులు సామాజిక, రాజకీయంగా చైతన్య ఉద్యమాలు చేపట్టినప్పుడే చట్ట సభల్లో అవకాశాలు దక్కుతాయని బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షులు నల్లా రాధాకృష్ణ అన్నారు. ఆదివారం నాచారంలో తెలంగాణ మేదరి మహేంద్ర సంఘం, రాజకీయ చైతన్య వేదిక ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి మేదరి కులస్తుల రాజకీయ చైతన్య శిక్షణ తరగతులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పూలే, అంబేడ్కర్, కాన్సీరామ్ ఆశయాలతో ఏ విధంగా రాజ్యాధికారం సాధించవచ్చో వివరించారు. మేదరులకు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలన్నారు. కార్యకమంలో రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాస్, మేదర రాజకీయ చైతన్య వేదిక కన్వీనర్ చంద్రమౌళి, శివరాజ్, సంఘం రాష్ట ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, ప్రచార కార్యదర్శి రమాకాంత్, ఉమా, శ్రీనివాస్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హర్ ఘర్ తిరంగా అభియాన్



ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

జవహర్‌నగర్: బీజేపీ అధిష్టానం పిలుపు మేరకు జవహర్‌నగర్ కార్పొరేషన్ ఈస్ట్ బీజేపీ అధ్యక్షులు జోగారావు ఆధ్వర్యంలో ఆదివారం జవహర్‌నగర్‌లో హర్ ఘర్ తిరంగా అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు పలువురు కాలనీల్లో దేశభక్తి నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కిసాన్‌మోర్చ కార్యవర్గ సభ్యులు మహిపాల్‌రెడ్డి, నాయకులు యాదగిరి, అనిల్‌గుప్తా, కనకరాజు, శ్రీధర్, విష్ణు సదానందం , రాజేందర్, అశోక్, శ్రీను, మల్లిఖార్జున్, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న మాజీ చైర్మన్ కొండల్‌రెడ్డి

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని సంస్కృతి టౌన్‌షిప్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మాజీ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి వైద్య శిబిరాన్ని పరిశీలించారు. అనంతరం వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్, టౌన్‌షిప్ ఫ్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు బెజ్జంకి హరిప్రసాదరావు, నిర్వాహకులు భరత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు

వైభవంగా శ్రీవరసిద్ధి వినాయక స్వామి స్థిర ప్రతిష్ఠామహోత్సవం

అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్ మధురనగర్ కాలనీలోని శ్రీ వరసిద్ధి వినాయక స్వామి స్థిర ప్రతిష్ఠా మహోత్సవం, హోమం ఆదివారం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మధురనగర్ కాలనీ అధ్యక్షులు పడాల సుధాకర్, మన్మథరెడ్డి, శివకుమార్, రాజగోపాల్‌రెడ్డి, భాస్కర్, నవీన్, కొండల్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అజయ్‌రెడ్డి, నాయకులు డోలి రమేష్, పరమేష్, శరణగిరి, సురేష్, నరేష్, ప్రశాంత్‌రెడ్డి, రేవంత్‌రెడ్డి, అరుణ్, కాలనీవాసులు, భక్తులు పాల్గొన్నారు.



తవ్వి వదిలేశారు..

శంకుస్థాపనలకే పరిమితమైన రోడ్డు పనులు

- రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు
- స్థానికుల అవస్థలు
- పట్టించుకోని అధికారులు

బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలోని పలు కాలనీల్లో చేపట్టిన సీసీ రోడ్డు పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. రోడ్డు పనుల కోసం శంకుస్థాపనలు చేసి రోడ్డును తవ్వి కంకర పోసి నెలలు గడుస్తున్నా పనులు అడుగు ముందుకు సాగలేదు. దీంతో కాలనీ ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి కాలనీవాసులకు సమస్యలను పరిష్కరించాలని పలుమార్లు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆయా కాలనీలవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ముందుకు సాగని హిమగిరి కాలనీ రోడ్డు..

2వ డివిజన్ పరిధిలోని హిమగిరి కాలనీలో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. రోడ్డును తవ్వి, కంకర పోసి చదును చేశారు. ఆ తర్వాత రోడ్డు వేయకుండా వదిలేశారు. నెలలు గడుస్తున్నా పనులు చేపట్టకపోవడంతో కాలనీవాసులు రాక పోకలు సాగించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

తవ్వారు... వదిలేశారు..

3వ డివిజన్ పరిధిలోని ఎంఎల్ఆర్ కాలనీలోని రోడ్డు నంబర్ 5లో సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. ఇందులో భాగంగా రోడ్డును తవ్వి కంకర పోశారు. రోడ్డు వేసేందుకు ఏర్పాట్లు చేయగా ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు కుంగిపోయింది. దీంతో మరింత కంకర పోసి రోడ్డు వేయాల్సి ఉంది. నెలలు గడుస్తున్నా కాంట్రాక్టర్ పట్టించుకోవడం లేదు. దీంతో వాహనాలు వెళ్లే మార్గం లేదక కాలనీవాసులు తమ వాహనాలను కాలనీ బయటే పార్కింగ్ చేయాల్సి వస్తోంది. డివిజన్ పరిధిలోని సాయి భవానీనగర్ కాలనీలోనూ రోడ్డు పనులను అలాగే వదిలేయడంతో వర్షానికి రోడ్డుపై నీళ్లు నిలిచిపోయాయి.



ఎంఎల్ఆర్ కాలనీలో కంకర పోసిన రోడ్డు



చెంగిచర్ల సాయి భవాని నగర్‌లో రోడ్డు దుస్థితి

నాసిరకంగా ప్యాచ్‌వర్క్ పనులు..

బోడుప్పల్‌లో ఈనెల 3, 4 తేదీల్లో బోనాల ఉత్సవాలను నిర్వహించారు. పలు చోట్ల రోడ్లకు ప్యాచ్ వర్క్ పనులు చేపట్టారు. ఇందులో భాగంగా ఈనెల 2న ప్రివిలేజ్ విలేజ్ కాలనీలో రోడ్డు కటింగ్ చేసి డ్రైనేజీ పనులు చేపట్టారు. అక్కడ ప్యాచ్ వర్క్ పనులు చేపట్టారు. సదరు రోడ్డుపై భారీ వాహనాలు వెళ్లడంతో రోడ్డు కుంగిపోవడంతోపాటు కంకర తేలింది. బంగారు మైసమ్మ ఆలయం వద్ద చేపట్టిన ప్యాచ్ వర్క్ పనుల్లో గురువారం కురిసిన వర్షానికి కొంత భాగం కొట్టుకుపోగా, మరికొంత భాగం కంకర తేలింది. లక్ష్మీనగర్(హుడా) కాలనీ ప్రధాన రహదారిలో పెద్ద గుంత పడగా అక్కడ ప్యాచ్ వర్క్ పనులు చేపట్టారు. నాసిరకం పనులు చేపట్టడంతో ప్యాచ్ వర్క్ భాగమంతా కంకర తేలింది.

టెండర్లలో అవకతవకలు..

బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలో పలు అభివృద్ధి పనులకు ఇటీవల ఆన్‌లైన్‌లో టెండర్ ప్రక్రియను చేపట్టారు. ఈ టెండర్ల కేటాయింపులో అవకతవకలు జరిగాయని కొందరు మంది కాంట్రాక్టర్లు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై ఉన్నతాధి కారులకు సైతం ఫిర్యాదు చేశారు.దీనిపై స్పందించి అధికారులు విచారణ చేపట్టారు. అక్రమాలు నిజమని తేలడంతో ఓ వర్క్ ఇన్‌స్పెక్టర్‌ను సస్పెండ్ చేయగా, డీఈని బదిలీ చేశారు.

త్వరితగతిన పనులు పూర్తి చేయాలి..

సీసీ రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేయాలి. కంకర పోసి నెలలు గడుస్తుండటంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాహనాలు దూరంగా ఉంచాల్సి వస్తోంది. పనులను త్వరితగతిన పూర్తి చేసి కాలనీ ప్రజలకు ఇబ్బందులను పరిష్కరించాలి.

– నర్సింహారెడ్డి, చెంగిచర్ల కాలనీ

ఇబ్బందులు లేకుండా చూస్తాం..

రోడ్డు పనులను త్వరగా పూర్తి చేసి ప్రజల ఇబ్బందులను పరిష్కరిస్తాం. రోడ్డు పటిష్టంగా ఉండేందుకు కంకర పోసి వదిలేస్తున్నాం. రోడ్డు గట్టి పడిన తర్వాత వేస్తున్నాం. టెండర్ ప్రక్రియలో అవకతవకలు జరిగినట్టు దృష్టికి వచ్చింది. సదరు టెండర్లు రద్దు చేశాం. ప్యాచ్ వర్క్ పనులు చేపట్టిన కాంట్రాక్టర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

– శైలజ, కమిషనర్ బోడుప్పల్

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన

బోడుప్పల్: 15వ డివిజన్ పరిధిలోని రాజలింగం కాలనీ ఫేస్ 2లో శ్రీ పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగాగా ఆయన మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందన్నారు. ఆలయాలు ప్రశాంతతకు నిలయాలన్నారు. కిశోర్‌గౌడ్ ఆలయ నిర్మాణానికి రూ 2లక్షలు విరాళం అందజేయడంతో ఆయనను కమిటీ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు, ఆలయ కమిటీ చైర్మన్ రూపని రామకృష్ణ, వైస్ చైర్మన్‌లు రూపని రాజు, చింతల నర్సింహారెడ్డి, కోశాధికారి కృష్ణయ్య, కాలనీవాసులు యాదగిరి, మధుసూదన్‌రెడ్డి, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన



ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో ఆదివారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. మయూరి కూచిపూడి నృత్యాలయ నాట్య గురువు శ్రీదేవి రాంకుమార్ శిష్య బృందం నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆద్యంతం అలరించింది. గిరిజ సుతునకు మహాగణపతిమ్, పాహిమాశ్రీ రాజా రాజేశ్వరి, అష్ట లక్ష్మీ కృష్ణం కలయసఖి, నారాయణీయం, ఒకపరి కామాక్షి స్తుతి, మహాదేవ తదితర అంశాలను కళాకారులు నందిత, హన్షిత, మనస్వీ, వాసవి, సాహిత, అస్మిత తదితరులు ప్రదర్శించి మెప్పించారు.